క్లుప్తంగా

రోగులకు అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం దాతల సహకారంతో రోగులు, వారి సహాయకులకు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు అన్నదానం చేశారు. మొత్తం 300 మంది రోగులు, సహాయకులకు అన్నదానం చేశామని యువర్స్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

తేరు తయారీ పనుల్లో పాల్గొనండి

అమడగూరు: అమడగూరులో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరీ అమ్మవారికి నూతనంగా చేస్తున్న తేరు తయారీ పనుల్లో భక్తులు పెద్దెత్తున పాల్గొనాలని ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమ రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో అమ్మవారికి తేరు లేదని, అయితే ఈ సారి నూతనంగా సుమారు రూ.30 లక్షల వ్యయంతో తేరును తయారు చేయిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం ఉదయం 10 గంటలకు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



భూసార పరీక్షలపై రైతులకు వివరిస్తున్న ఏఓ రమాదేవి

తాడిమర్రి: పొలాల్లో భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ రమాదేవి రైతులకు సూచించారు. మర్రిమాకులపల్లిలో బుధవారం ఆమె రైతులతో కలసి పొలాల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేస్తున్న భూముల్లోని మట్టిని సేకరించి రైతు భరోసా కేంద్రాల్లో ఇవ్వాలన్నారు. అక్కడ సిబ్బంది ఆ మట్టి నమూనాలను వ్యవసాయ పరిశోధన కేంద్రాలకు తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తారన్నారు. వారు అందించిన పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు ఇస్తామన్నారు. అలాగే కార్డుల్లో నమోదు చేసిన వివరాల ప్రకారం పంటలకు కావలసిన మందులు వేసుకోవచ్చన్నారు. దీంతో పంట నాణ్యతతో పాటు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

సింగిల్ విండో మాజీ అధ్యక్షుడి మృతి



మృతుడు సంజీవరెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలోని దామాజిపల్లి సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు సంజీవరెడ్డి (82) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య లీలమ్మ ఉన్నారు. మృతుడు సంజీవరెడ్డి 2012 నుంచి 2017 వరకూ దామాజిపల్లి సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ గోవిందరెడ్డితో పాటు నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, మనేరు నరసింహులు, హనుమంత రెడ్డి తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడానికి నియమించిన మండల స్థాయి సిబ్బందికి అక్రమ రవాణా నివారణ చర్యలు, అమలులో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇసుక అక్రమ రవాణా జరిగినట్లు తేలితే రవాణా చేసే వ్యక్తులు, వాహనాలను సీజ్ చేసి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. గనులశాఖ, ఇరిగేషన్, తహసీల్దార్లు, ఇసుక రవాణా పర్యవేక్షక ఇన్‌చార్జ్‌లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో చీకటి రోజు

● సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలపై పాత్రికేయుల నిరసన ● పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఓడీచెరువు పోలీసుస్టేషన్‌లో వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు



ధర్మవరంలో సీఐకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు



అమడగూరులో వినతిని అందజేస్తున్న పాత్రికేయులు

ప్రశాంతి నిలయం: సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయరెడ్డి ఇంటిలో గురువారం పోలీసులు ఎలాంటి అనుమతి లేకుండా సోదాలు చేయడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజని జర్నలిస్టులు మండిపడ్డారు. గురువారం వారు సాక్షి ఎడిటర్ ఇంటిలో సోదాలు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్‌డీఓ కార్యాలయంలో డీఏఓ వెంకటమునికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సాక్షి దినపత్రిక శ్రీసత్యసాయి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దివిటి రాజేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికితీయడం, సమాజంలో జరిగే అవినీతి,అక్రమాలపై వార్తలు రాయడం పాత్రికేయులు విధి అన్నారు. విధి నిర్వహణలో భాగంగా వార్తలు రాసే జర్నలిస్టులు, ఎడిటర్లపై అక్రమకేసులు బనాయించి పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం మానుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాక్షితోపాటు ఇతర మీడియా సభ్యులపైనా అక్రమ కేసులు బనాయించడం భయభ్రాంతులకు గురి చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పద్ధతి మార్చుకోవాలని లేనిపక్షంలో రాబోవు రోజుల్లో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

అమడగూరు: సాక్షి దినపత్రిక సంపాదకులు ఆర్ ధనుంజయరెడ్డి ఇంటిపై గురువారం పోలీసులు దాడి చేయడం దారుణమని పాత్రికేయులు పేర్కొన్నారు. పోలీసులు ఎలాంటి అనుమతి లేకుండా సంపాదకుడి ఇంటిలో సోదాలు చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ముదిగుబ్బ: సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో అనుమతి లేకుండా పోలీసులు సోదాలు చేయడం దారుణమని పాత్రికేయులు పేర్కొన్నారు. పోలీసుల చర్యపై వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనుమతి లేకుండా తనిఖీ చేపట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. పాత్రికేయులు శేఖర్, వెంకటరాముడు, రాజేష్, దొడ్డప్ప, గోపాల్, నరేష్ పాల్గొన్నారు.

ఓడీ చెరువు: సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంటిలో అనుమతి లేకుండా పోలీసులు సోదాలు చేయడాన్ని నిరసిస్తూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విలేకరులు గురువారం ర్యాలీగా వెళ్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నేతలు భూజంగ రావు, సాదిక్, ఓడీసీ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శ్రీనివాసులు, జర్నలిస్టులు మల్లికార్జునరెడ్డి, వెంకటరంగారెడ్డి, బాబా, ఆనంద్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



తాడిమర్రిలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పాత్రికేయులు



ముదిగుబ్బలో పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

సాక్షి ఎడిటర్‌పై వేధింపులు ఆపాలి

ధర్మవరం: ప్రజాస్వామ్యానికి నిలువుటద్దం పత్రికా స్వేచ్ఛ అని, సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై వేధింపులు ఆపాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే డివిజన్ అధ్యక్షుడు జానపాటి మోహన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జీవీ నారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు పూల మూర్తి ప్రసాద్, రమేష్ నాయుడు, బావిశెట్టి, పామాల నాగేంద్ర, గౌరవాధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిని పోలీసులు అనుమతి లేకుండా సోదాలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు నల్లబ్యాడ్జీలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పది కాలాల పాటు వర్ధిల్లాలంటే పత్రికా స్వేచ్ఛను రక్షించాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు పత్రికాస్వేచ్ఛ కోసం పోరాడాల్సిన అవశ్యకత ఎంతైన ఉందన్నారు. ఆ సంఘం నాయకులు గోల్డ్ ప్రసాద్, జయశంకర్, సంద్ర రమేష్, కళ్యాణ్, ఇలియాజ్‌తో పాటు ఏపీయుడబ్ల్యూజేఎఫ్ గౌరవాధ్యక్షుడు శ్రీశైలం భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

తాడిమర్రి: అనుమతి లేకుండా సాక్షి సంపాదకులు ఆర్.ధనుంజయరెడ్డి ఇంటిలో సోదాలు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ధర్మవరం డివిజన్ ఉపాధ్యక్షులు చందమామ వీరనారప్ప ఆధ్వర్యంలో డివిజన్ కార్యదరి బండారు వెంకటేష్(సూర్య), మండల కమిటీ ప్రధాన కార్యదర్శి అగిలే అనంతరెడ్డి, ఎపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ నాయకులు వీరబొమ్మ నాగరాజయ్య తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీ.భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పోలీసులు వారెంట్ లేకుండా ఇంటిలోకి దౌర్జన్యంగా ప్రవేశించడం పత్రికాస్వేచ్ఛను కాల రాయడమేనన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని సన్మానిస్తున్న నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు కళ్యాణ్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు సాధిక్

బత్తలపల్లి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన జగనన్న ప్రభుత్వం ప్రజల గుండెల్లో గూడు కట్టుకుంటే, అధికారమే ధ్యేయంగా ప్రజలకు అలవికాని హామీలను ఇచ్చి నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తితో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన స్వగృహంలో ఇటీవల నియమితులైన ధర్మవరం నియోజకవర్గ కల్చరల్ సెల్ ప్రెసిడెంట్ షరాబ్ యోగానంద ఆచారీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు బత్తలపల్లి నుంచి కేతిరెడ్డి ఇంటి వరకూకు బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువచ్చి పార్టీ అభివృద్ధికి సందరూ సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా నిలబడి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్, నాయకులు వక్కల శంకరయ్య, బోయపాటి సూరీ, చర్మాల సురేష్, జిలానీసాబ్, షాషు, షేక్షావలి, మందల నారాయణ, శ్రీరాములు, సాకే కిరణ్, నాగభూషణ, ముసలయ్యలతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేతిరెడ్డిని కలిసిన అనుబంధాల సంఘాల అధ్యక్షులు

ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ అనుబంధాల సంఘాల అధ్యక్షులు గురువారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఆయన ఇంటిలో కలిశారు. ఐటీ విభాగం అధ్యక్షుడు రేగాటిపల్లి కళ్యాణ్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పీఎంజెడ్ సాధిక్ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. నాయకులు చాంద్‌బాషా, అమీర్‌బాషా, హిదయ్‌తుల్లా, ఫయాజ్, జహీర్, షబ్బీర్, హిద్దు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి: అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు ఏర్పాటు చేసే పరిశ్రమల స్థాపనకు రైతులతో పాటు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. దాదులూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల పార్క్ (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు గురువారం భూమి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిశ్రమలు వస్తేనే ఏ ప్రాంతమైన అభివృద్ధిలోకి వస్తుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఈ ప్రాంతంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొనేవారికి ఈ పార్క్ ఏర్పాటు చేస్తుందన్నారు. దీనిని నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అక్కడికి సమీపంలో నిర్మించిన గోరుచిక్కుడు పరిశ్రమ గోదాములను పరిశీలించారు. వీటిని నిరుపయోగంగా ఉంచకుండా రైతులకు ఉపయోగపడేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం సోనీ, ధర్మవరం ఆర్డీఓ మహేష్, టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక సామర్థ్యం పెంపు

కనగానపల్లి: రోజై యోగా చేయడం ద్వారా పిల్లలలో శారీరిక, మానసిక సామర్థ్యం పెంపొందుతాయని యోగా గురువు సుబ్బరాయుడు తెలిపారు. కనగానపల్లి యోగాసనా స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో భాగంగా ఉచిత యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పాఠశాలలో రోజూ 50 మంది పిల్లలు యోగాసనాలపై శిక్షణ పొందుతున్నారన్నారు. ఇందులో శిక్షణ పొందిన వారికి జిల్లా, రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని యోగా గురువు తెలిపారు. ఈనెల 23 తేదీ వరకు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని యోగసనా స్పోర్ట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక పరిశీలించనున్నారని తెలిపారు.

‘యువగళం’ హామీలు నేరవేర్చాలి

పుట్టపర్తి టౌన్: యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల వలరాజు, జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయలంలో వారు విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో ఉమ్మడి పీజీ అడ్మిషన్లు రద్దు చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అయితే ఇటీవల ఉన్నత విద్యామండలి పీజీ సెట్ నోటిఫికేషన్ పాత పద్ధతిలోనే విడుదల చేసిందన్నారు. నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే 107, 108 జీఓలను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజుల పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరశింహమూర్తి, నాయకులు హరిప్రసాద్, నందకిషోర్, రాజుయల్, అభిషేక్, గణేష్, నవీన్, మహేష్‌నాయక్, వినోద్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

నల్లచెరువు: పాత రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మదనపల్లికి చెందిన శ్రీనివాసులు తన భార్య సరస్వతితో కలిసి వ్యక్తిగత పనులపై కదిరికి బయలుదేరారు. అయితే మండలంలోని పాత రైల్వే స్టేషన్ వద్దనున్న స్పీడ్ బ్రేకర్స్ వద్దకు రాగానే ఒక్కసారిగా వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో సరస్వతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రేపటి నుంచి చౌడేశ్వరి కుంభాభిషేకం

తాడిమర్రి: పెద్దకోట్ల గ్రామంలో వెలసిన చౌడేశ్వరి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు చౌడేశ్వరి పుష్కర కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త పాటిల్ ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత పాటిల్ కపిల్‌నాథ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సం గ్రహణం, ఋత్విక్ వరణం, అంకురార్పణ, అంకురార్పణ హోమం, గణపతి హోమం, వాస్తు హోమం నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, మహా కలశ ఆవాహన, ఆరాధన తదితర పూజలు ఉంటాయని, సోమవారం చౌడేశ్వరి దేవి కళా కర్షన, అంగన్యాస కరన్యాసం, భక్తులకు అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నేత మృతి



నాగభూషణ రెడ్డి(ఫైల్)

నల్లచెరువు: కె.పూలకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.నాగభూషణ రెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణ్‌రెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాగభూషణ్‌రెడ్డి ఎంతో కృషి చేశారని వారు పేర్కొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



కమ్మవారిపల్లి లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి టౌన్: రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ నగేష్ సూచించారు. గురువారం కమ్మవారిపల్లిలో వడదెబ్బ, అసంక్రామిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్న సమయంలో బయట తిరగరాదన్నారు. పనులు ఉదయం 10గంటల లోపు, సాయంత్రం 3 గంటలపైన ఉండేట్లు చూసుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు రాజేశ్వరి, ఆశాకార్యకర్త సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన వన్నా మల్లికార్జునరెడ్డి (40) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి తరలిరండి



వివరాలు వెల్లడిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ ట్రస్ట్ గురుస్వామి పీజే విజయ్‌కుమార్

ధర్మవరం అర్బన్: కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి భక్తులు తరలిరావాలని అయ్యప్పస్వామి ఆలయ ట్రస్ట్ గురుస్వామి పీజే విజయ్‌కుమార్ కోరారు. గురువారం ఆలయంలో ఆయన కమిటీ సభ్యుడు బండ్లపల్లి వెంకట జయప్రకాష్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఈనెల 10న మహాగణపతి పూజ, హోమాలు, ప్రత్యేక పూజలు, 11న ప్రత్యేక హోమాలతోపాటు సాయంత్రం మూలమూర్తుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. 12, 13 తేదీల్లో హోమాలు, పూజలు, 14న మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి, నవరత్నలింగ, నవగ్రహమూర్తుల సహిత హరిహర పుత్ర అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం జరుగుతుందని వివరించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్: ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులకు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆర్డీఓ వీవీఎస్ శర్మతో కలిసి నియోజకవర్గంలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, కాలయాపన లేకుండా పనులు చేసిపెట్టాలన్నారు. మీ స్థాయిలో పరిష్కరించలేని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న రజక సంఘం నాయకులు

ప్రశాంతి నిలయం: రజకులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని రజక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో దోభీ ఘాట్లు నిర్మించాలని, 50 ఏళ్ల నిండిన రజకులకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఏపీ రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాపనపల్లి శివప్ప, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కదిరి టౌన్ అధ్యక్షుడు గంగన్న, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామ్‌కుమార్, పెద్దయ్య, తలుపుల నారాయణ, పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు గంగాధర్, కొత్తచెరువు రాధమ్మ పాల్గొన్నారు.